## ఫెంగ్ షుయి



### ప్రేమ పక్షులు

ప్రతి జీవికీ అనుభవంలోకి వచ్చేది, అనిర్వచనీయమైనది ప్రేమ. మనుషులకే కాదు, జంతువులు, పక్షులకూ ప్రేమ ఉంటుంది. చెట్లమీద చూశామంటే కొమ్మలపై పక్షులు జంటలు జంటలుగా కూర్చొని ఊసులాడుకుంటూ ఉంటాయి. అలాంటి పక్షులను చూసినప్పుడు మన మనసుకు ఆహ్లాదంగా అనిపిస్తుంది. ఇంట్లో ఇలాంటి ప్రేమ పక్షుల పెయింటింగ్‌ను గోడకి తగిలిస్తే మంచిది. రోజూ ఈ ఫొటోను ఇంట్లో చూస్తుండటం వల్ల భార్యాభర్తల మధ్య ఒకరిపట్ల ఒకరికి అనురాగం, ప్రేమ పెరుగుతాయి. తామిద్దరం ఒకరికోసం మరొకరు పుట్టామనే భావన వారిలో కలుగుతుంది. అయితే పొరపాటున కూడా పంజరంలో ఉండే పక్షుల బొమ్మను ఇంట్లో ఉంచకూడదు. పంజరంలో ఉన్న పక్షుల బొమ్మ స్వేచ్ఛకు ప్రతి బంధకం. లేదూ ఉన్నత స్థితికి ఎదగాలనే కోరిక లేకుండా చేస్తుంది. అందువలన ఇంట్లో ఏర్పాటు చేసుకునే బొమ్మలో పక్షులు రెండూ ఆకాశమే హద్దు అన్నంత స్వేచ్ఛగా ఉండేలా చూసుకోవాలి. దీనిని హాలులో గాని, పడకగదిలో గాని నైరుతి మూలలో మాత్రమే ఉంచాలి. ప్రేమపక్షులు లేకపోతే, 'మేండరిన్' బాతుల జంటను ఇంట్లో పెట్టుకుంటే భార్యాభర్తల సఖ్యతపై మంచి ప్రభావం కనిపిస్తుంది.



పెళ్లికావాలనుకునే వారు కూడా తమ పడకగదిలో మేండరిన్ బాతుల బొమ్మను ఏర్పాటు చేసుకుంటే చక్కటి ఫలితం ఉంటుంది. అయితే ఎట్టి పరిస్థితులలోనూ ఒంటరి బాతును మాత్రం ఇంట్లో పెట్టుకోకూడదు. ఒంటరి బాతు ఉంటే ఎప్పటికీ అవివాహితులుగానే మిగిలిపోతారు. మూడు బాతులు ఉండే బొమ్మను కూడా ఇంట్లో పెట్టుకోకూడదు. మూడు బాతుల బొమ్మ ఉంటే దంపతుల మధ్య మూడో వ్యక్తి ప్రవేశించి కుటుంబంలో కలహాలు తలెత్తే ప్రమాదం ఉంది.

*

వారం వారం 'ఫెంగ్ షుయి' మీకోసం

## 'సరసి' కత

వైశంపాయనుడు పరీక్ష హాల్లో పరీక్ష చెక్కి పడేస్తున్నాడు. అన్నీ తెలిసిన ప్రశ్నలే కావడం చేత నల్లేరు బండిలా వుంది అతని పని. పరపరా రాసి పారేసి విజయగర్వంతో కర్చీఫ్ తీసి చెమటలు తుడుచుకున్నాడు. అప్పుడు గుర్తు కొచ్చిందతడికి తను అంతకు కొద్ది రోజుల ముందు వినాయకుడి గుళ్లో మొక్కుకున్న సంగతి. "దేవుడా, పేపరు కనక ఈజీగా వస్తే నాలుగు కేజీల పులిహోర ప్రసాదం చేయించి నీ గుళ్లో ఇస్తా, గట్టెక్కించు" అని. టైము చూసుకుంటే గంట కొట్టడానికింకా అరగంట టైముంది.

వెంటనే ఇంకో అడిషనల్ కాగితం అడిగి తీసుకుని పులిహోర కెంత అవుతుందో డీటెయిల్డుగా లెక్క వేశాడు. బియ్యం, నూని, చింతపండూ, పోపు సామానూ, గ్యాసూ– అన్నిటి లెక్కలూ వేసి టోటల్ కూడి చూశాడు. నాలుగు వందల రూపాయలు దాటుతోంది. 'అయ్యబాబోయ్ నాలుగొందలే!' గుండెలు బాదుకున్నాడు వైశంపాయనుడు.

వెంటనే బుర్రలో దుర్బుద్ధేదో చిన్నగా పుట్టి క్షణంలో ఒక షేపు కొచ్చేసింది. ఎలాగూ బాగా రాసేశాం కాబట్టి ఇప్పుడింక మొక్కు తీర్చకపోతే ఏమైందిటా? అయినా దేవుడే కరుణించాడనేం



### ముక్కుబడి

వుంది? తన స్వయం ప్రతిభ వల్లే రాసేడేమో! అనుకుంటూ పులిహోర ప్రసాదం చేయించే ఆలోచనకి స్వస్తి చెప్పాడు వైశంపాయనుడు. నాలుగు వందలు కలిసొచ్చాయి అనుకోగానే ప్రాణం హాయిగా గాల్లో విహరించింది. ఈలోగా వార్నింగ్ బెల్ కొట్టేరు. ఒక పక్కనించి ఇన్విజిలేటర్లు పేపర్లు లాక్కోవడం ప్రారంభించారు. వైశంపాయనుడు హడావుడిగా ఆన్సరు పేపర్లని బొత్తుగా చేసి, దారానికి కట్టి ఇచ్చేశాడు. పులిహోర లెక్కలు వేసిన కాగితాన్ని మడిచి జేబులో పెట్టుకుని ఈల వేసుకుంటూ బైటకొచ్చేడు.

ఇంటికొచ్చాక పడక్కుర్చీలో తీరిగ్గా కూర్చుని, జేబులోంచి మడత పెట్టిన కాగితాన్ని నవ్వకుంటూ విప్పి చూశాడు. నవ్వు క్షణంలో ఆవిరైపోయింది. అది పులిహోర లెక్కల కాగితం కాదు–ఆన్సర్లు రాసిన కాగితాల్లో ఓ కాగితం! వైశంపాయనుడి గుండె గుభేలుమంది. అంటే హడావుడిలో తను పులిహోర ఖర్చు రాసిన కాగితాన్ని ఇన్విజిలేటర్ కిచ్చేసి, ఆన్సరు షీట్సులో ఒకదాన్ని తెచ్చేసుకున్నాడా? అవును అదే జరిగింది! వైశంపాయనుడు బావురుమంటూ జుట్టు పీక్కున్నాడు!

రిజల్ట్సు వచ్చేక మరోసారి కూడా అదే సీను రిపీట్ అయింది! కారణం – నాలుగు మార్కుల్లో పరీక్ష పోయింది!

*